క్లుప్తంగా

రేపు బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలో వెలసిన కోదండరామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకటాక్షం పొందాలని కోరారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

అయిజ: భారత రాజ్యాంగంపై ప్రతి పౌరుడికి అవగాహన అవసరమని ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు భరత్ అన్నారు. సోమవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగంపై అవగాహన లేకనే పేద ప్రజలు అణచివేతకు గురవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కమిటీ సభ్యులు లక్ష్మణ్, రాజు, సునిల్, సందీప్, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ కమిటీ ఏర్పాటు

మానవపాడు: మండలంలోని ఏ.బూడిదపాడులో అంబేడ్కర్ విగ్రహ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వికాస్‌రాజ్, మణిరాజ్, సెక్రెటరీ, జనరల్ సెక్రెటరీలుగా రాజశేఖర్, మురళి, కోశాధికారి రాంబాబు, ఆర్గనైజింగ్ కన్వీనర్ అనిల్ కుమార్, సభ్యులుగా చక్రవర్తి, మహేష్, శేఖర్, తదితరులను ఎన్నుకున్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మల్దకల్: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతులకు అవసరమైన జీలుగ(పచ్చిరొట్ట ఎరువు) విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆయా గ్రామాలకు చెందిన ఏఈఓలను సంప్రదించాలని కోరారు. మండలానికి మొత్తం 60 క్వింటాళ్ల జీలుగ రాగా ప్రభుత్వ సబ్సిడీ కింద 30 కేజీలకు రూ. 843 చెల్లించాలని ఏఓ తెలిపారు.

ఈత వనాల రక్షణపై దృష్టి

రాజోళి: ఈత వనాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు జయన్న గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గీతా కార్మికులు వృత్తిని కొనసాగించేందుకు ఈత వనాలు ప్రధాన వనరుగా ఉండగా, ప్రభుత్వ పథకాల పేరుతో తొలగిస్తున్నారని, దీని ద్వారా కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్మికులకు నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్ధయ్య గౌడ్, వడ్డేపల్లి మండల అధ్యక్షుడు రాధాకృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శి పరమేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు వెంకట్రామన్ గౌడ్, అర్జున్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

రాజోళి: మండలంలోని కొత్త రాజోళిలో నిత్యం నిత్యం విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నట్లు సీపీఎం నాయకుడు విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఎవరికి తెలియని పరిస్థితి ఉందని ఆరోపించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంల లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య త్వరగా పరిష్కరించాలని కోరారు.

రిమాండ్‌కు తరలింపు

అలంపూర్ రూరల్: మండలంలోని శింగవరం – 1 గ్రామానికి చెందిన వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుడు హరికృష్ణను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. భర్త వేధింపులు భరించలేక వివాహిత మల్లిక(22) ఒంటికి నిప్పటించుకొని శనివారం మృతి చెందింది. ఈ ఘటనలో భర్త హరికృష్ణను గద్వాల కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ

గద్వాల రూరల్: గొప్ప సంస్కర్త భాగ్యరెడ్డివర్మ అని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డివర్మ 135వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1888లో జన్మించిన భాగ్యరెడ్డివర్మ దళిత ఉద్యమ వైతాళికుడు అని పేరుపొందారని, దళితుల అభ్యున్నతి కోసం, నిరక్ష్యరాస్యత నిర్మూలన, జోగిని దురాచార వ్యవస్థను రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాములు, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధ్యక్షుడు శ్వేతాప్రియదర్శిని, కలెక్టరేట్ ఏవో యాదగిరి, సూపరింటెండెంట్లు రాజు, మదన్‌మోహన్, డీపీఆర్వో చెన్నమ్మ పాల్గొన్నారు.

తగ్గిన సీడ్ పత్తి సాగు



ధరూరు శివారులో సాగు చేసిన సీడ్ పత్తి

ధరూరు: పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. రోజురోజుకు పత్తి సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది. నాలుగు దశాబ్దాలుగా మండల వ్యాప్తంగా పత్తిపంట కళకళలాడింది. ప్రస్తుత ఏడాది మండలంలో సాగు విస్తీర్ణం తగ్గింది.

గతేడాది మండలంలో 6,700 ఎకరాల్లో సీడ్ పత్తి సాగు కాగా.. ఈ సారి 5,400 ఎకరాల్లో సాగైంది. ఇంకా అక్కడక్కడ సాగు పనులు జరుగుతున్నాయి. ఈ నెలాఖరు వరకు సీడ్ పత్తి పంట సాగు కావాల్సి ఉండడంతో గతేడాది కంటే పంట సాగు పెరిగే అవకాశాలు లేవని వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు అంటున్నారు.

ఆర్గనైజర్ల దోపిడీ..

నాలుగు దశాబ్దాలుగా సీడ్ ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు రైతులను దోపిడీ చేస్తూనే ఉన్నారు. ఆర్గనైజర్లు రైతులను మోసం చేస్తూ అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదించారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఆర్గనైజర్ల తీరుతోనే రైతులు పత్తి సాగు చేసేందుకు ముందుకు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో సీడ్ ఆర్గనైజర్ల మోసాలను రాజకీయ నాయకులు రైతులకు అవగాహన కల్పించడం వల్ల చాలా మంది పంట మార్పిడికి సిద్ధమవుతున్నారు.

రైతులకు న్యాయం చేయండి



ఎకరం పొలంలో పత్తి సాగు చేశాను. ఆర్గనైజర్లు నాలుగైదు సార్లు పంట వద్దకు వచ్చి (బెరికి) పని కిరాని చెట్లు పీకేస్తున్నారు. దీంతో దిగుబడి తగ్గుతోంది. కనీసం పంట పెట్టుబడి కూడా రావడం లేదు.

నర్సింహులు, రైతు, ఆలూరు

స్థిరంగా ఉండే అవకాశం



మండలంలో సీడ్ పత్తి సాగు విస్తీర్ణం బాగానే ఉంది. ఈ సారి కూడా పంట సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా పంట సాగయ్యే అవకాశం ఉంది. రైతులు దళారులను ఆశ్రయించొద్దు. నాసికర విత్తనాలు వల్లే దిగుబడి తగ్గుతుంది.

శ్రీలత, వ్యవసాయ శాఖ అధికారిణి ధరూరు

అంధత్వ నివారణే లక్ష్యం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ మనోరమ

కేటీదొడ్డి: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మనోరమ అన్నారు. సోమవారం మండలంలోని పాతపాలెంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. 116 మంది కంటి పరీక్షలు నిర్వహించగా 11 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 17 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రవికుమార్, వైద్యులు నీలిమ, సర్పంచ్ సూర్యప్రకాష్, నాయకులు చక్రధర్, ఆంజనేయులు, నర్సింహులు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని ఆలూరు, తుమ్మలచెరువు, బల్గెర గ్రామాల్లో సోమవారం కంటి వెలుగు శిబిరాలు కొనసాగాయి. మూడు గ్రామాల్లో కలిపి మొత్తం 412 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, ఇందులో 28 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 31 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, సమీరాకౌసర్, హెల్త్‌సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు భారతి, ఖేజీయా, రావేల, ఆయా గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల–2 గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ సునీత ప్రారంభించారు. 154 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు పేర్కొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో మూడోరోజు సోమవారం కంటి వెలుగు శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి అద్దాలను అందజేశారు.



ఉండవెల్లిలోని మారమునగాల–2లో..



గట్టులోని ఆలూరులో..

పట్టుదలతో విజయం తథ్యం

గద్వాల అర్బన్: క్రమశిక్షణతో కృషి, పట్టుదలతో చదివితే విజయం తథ్యమని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపతి నాయుడు అన్నారు. సోమవారం ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ కీలకమన్నారు. నేటి పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో పోటీ పడుతూ నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థినుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బహుమతులు అందజేత..

గతేడాది సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నగదు బహుమతి, మెడల్స్‌ను అందజేసి అభినందించారు. ఇదిలా ఉండగా 2023–24 విద్యా సంవత్సరం సంబంధించి కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సాయి శ్యామ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

ఎన్‌క్యూఏఎస్ బృందం పీహెచ్‌సీ సందర్శన

రాజోళి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఎన్‌క్యూఏఎస్(నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్) బృందం సోమవారం పరిశీలించారు. ఆస్పత్రిలో ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు, ప్రసవాలు గణాంకాలు, టీబీ, లెప్రసీ లాంటి వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఎలాంటి మందులు, వైద్య సేవలు అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఓపీ నిర్వహణ, రోజువారిగా వచ్చే రోగుల సంఖ్య, వివిధ సేవల వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రధానంగా ల్యాబ్‌ల పనితీరు, పరిసరాల పరిశుభ్రతను బృందం పరిశీలించింది. కార్యక్రమంలో ఎన్‌క్యూఏఎస్ బృందం సభ్యులు డాక్టర్ హర్షాల సుధాకర్ వేడక్, డాక్టర్ బిందియా రాజ్‌పుత్, జిల్లా మేనేజర్ రాజు, మెడికల్ ఆఫీసర్ మధుబాబు, రామకృష్ణ, రంజిత్ కుమార్, జయప్రకాష్, ఏఎన్‌ఎంలు, ల్యాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న బృందం సభ్యులు

సరిహద్దులో విస్తృతంగా వాహనాల తనిఖీ



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు, అధికారులు

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులో అధికారులు తనిఖీలు చేపట్టారు. పక్క రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడానికి గత మూడు రోజులుగా నిరంతర తనిఖీలు చేపడుతున్నారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉండవెల్లి పోలీసులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ బాలరాజు, ఏఎస్‌ఐ అయ్యన్న, వ్యవసాయ శాఖ ఏఈఓ ఆదిల్, వీఆర్‌ఏ శేక్షావలి, కానిస్టేబుల్ సలీం బృందం ఏపీ తోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను టోల్‌ప్లాజా వద్ద నిలిపి తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా నకిలీ విత్తనాలు, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడానికి జిల్లా ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అనుమానం వచ్చిన వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు.

నిరాహార దీక్షకు కాంగ్రెస్ నాయకుల మద్దతు



మాట్లాడుతున్న శేక్షావలి ఆచారి

అయిజ: మేడికొండను నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష సోమవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. కాంగ్రెస్ రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి శేక్షావలి ఆచారి, మండల అధ్యక్షుడు జయన్న దీక్ష శిబిరానికి చేరుకొని గ్రామస్తులు మద్దతు తెలిపి మాట్లాడారు. మండల కేంద్రానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు మేడికొండలో ఉన్నాయన్నారు. వెంటనే మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

వృథాగా పశువుల నీటితొట్టి



బస్వాపురంలో వృథాగా ఉన్న నీటి తొట్టి

ఉండవెల్లి: మండలంలోని బస్వాపురం వైకుంఠ ధామం ఎదుట పశువుల కోసం నీటితొట్టిని నిర్మించారు. అయితే నల్లా కనెక్షన్ లేకపోవడంతో నీరు లేక వెలవెలబోతోంది. దీంతో మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. పశువుల నీటితొట్టిలు ఏర్పాటు చేసినా నిరుపయోగంగా మారాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు నల్లాను ఏర్పాటు చేసి నీటిని నింపాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఘనంగా మాజీ ఎంపీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మందా జగన్నాథం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరులో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి మాజీ ఎంపీ మందా జగన్నాథం జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందా జగన్నాథం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మందా శ్రీనాథ్, వడ్డేపల్లి శ్రీనివాసులు, మహేశ్వరెడ్డి, అంజి, గిడ్డారెడ్డి, రాంరెడ్డి, ఎల్కూర్ శ్రీను, జోగుల రవి, యోహాన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలనందించాలని పురచైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో శ్రీఆదిత్య చిన్నపిల్లల ఆస్పత్రిని ప్రారంభించారు. వారం రోజులపాటు ఉచితంగా వైద్య సేవలను, ప్రతి ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ బాలరాజు తెలిపారు. మండలంలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేగంగా కల్వర్టుల నిర్మాణాలు

మున్సిపాలిటీ పరిధిలోని అమరచింత రోడ్డుపై నిర్మిస్తున్న కల్వర్టుల నిర్మాణాలు త్వరతగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మాణ పనులను కమిషనర్ నాగరాజుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గద్వాలలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. కేటీదొడ్డి మండలం కుచ్చినెర్ల గ్రామానికి చెందిన రైతు భీమయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో రైతుబీమా మంజూరైంది. దీంతో సోమవారం సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మృతుడి భార్య దేవమ్మకు రైతుబీమా నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా గద్వాల మండలం లత్తీపురం గ్రామానికి చెందిన మాలరంగన్న, లక్ష్మీలకు చెందిన గుడిసె విద్యుదాఘాతంతో దగ్ధం కావడంతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి జ్యోతి బాధితులకు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు వివాహ దినోత్సవ వేడుకను పార్టీ కార్యకర్తల సమక్షంలో జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, గ్రంథాలయ జిల్లా చైర్మన్ జంబురామన్‌గౌడ్, జెడ్పీటీసీ రాజశేఖర్, ఎంపీపీ విజయ్‌కుమార్, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ప్రభుత్వం ఆదుకోవాలి

మల్దకల్: వాల్మీకి బోయలను ప్రభుత్వం ఆదుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు లవన్న, విష్ణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సమితి ఆధ్వర్యంలో వాల్మీకీ బోయలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకీ బోయలకు ప్రభుత్వం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ హరికృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు కిష్టన్న, ప్రేమ్‌రాజ్, గోపాల్, లక్ష్మన్న, తిరుపతన్న, తిమ్మప్ప, అశన్న, నేతన్న, వెంకట్రాములు, భీసన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక మత్స్య సహకార సంఘం ఎన్నికలు



నియామక పత్రాలు అందజేస్తున్న అధికారి రాజు

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నెలో ప్రాథమిక మత్స్య సహకార సంఘం ఎన్నికలు ఆ సంఘం అధికారి రాజు నాయక్ ఆధ్వర్యంలోని నిర్వహించారు. అధ్యక్షుడిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా దుబ్బ గోకారప్ప, కార్యదర్శిగా పరుషరాముడు, డైరెక్టర్లుగా పెద్ద రాములు, ఆటో రాములు, మల్లేష్, వెంకటేష్, శ్రీనువాసులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గద్వాల సొసైటీ అధ్యక్షుడు వెంకట్రాములు, దబ్బ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

2న క్విజ్ పోటీలు



శాంతినగర్‌లో కరపత్రాలు విడుదల చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతినగర్: తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గంలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తునట్లు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. సోమవారం వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అలంపూర్ నియోజకవర్గం నుంచి యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

అయిజ: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 3వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, ఏఈ గోపాల్, వైస్ చైర్మన్ మాల నరసింహులుతో కలిసి ఆయన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో విడుతల వారీగా అవసరమైన మేరకు సీసీ రోడ్లు, డ్రైయినేజీ నిర్మాణం చేపడుతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గిత్తల దేవరాజు, కాంట్రాక్టర్ మాదన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



గట్టులో డైరీ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

గట్టు: స్వచ్ఛంద సంస్థల ద్వారా సామాజిక సేవలతో పాటుగా విద్యాభివృద్ధికి పాటుపడాలని రిటైర్డ్ హెచ్‌ఎం గోవిందప్ప కోరారు. మండల కేంద్రంలో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన రిటైర్డ్ హెడ్మాస్టర్ గోవిందప్పను సోమవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఎన్‌టీఎస్‌ఎఫ్ అధ్యక్షుడు పాల్వాయి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండాపురం ప్రతాప్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ డైరీని గోవిందప్పకు అందజేశారు. కార్యక్రమంలో రాజుసాగర్, సత్యనారాయణ, గోపినాథ్, కృష్ణ, వీరేష్‌సాగర్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

తొలితరం ఉద్యమకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల రూరల్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గద్వాల ప్రాంతానికి చెందిన తెలంగాణ తొలితరం ఉద్యమకారులైన పాశం సర్వారెడ్డి, కొట్టం వేణుగోపాల్‌ల విగ్రహాలను ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ ఫోరం నాయకులు మోహన్‌రావు, భీంసేన్‌రావులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో కలెక్టర్ వల్లూరు క్రాంతిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పాతబస్టాండు ఎదుట విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రామన్‌గౌడ్, సాంబశివరావు, విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

అందుబాటులో లేని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

అమరచింత: వేసవి ఎండలు ముదురుతున్న వేళ ఎండల నుంచి ఉపసమనం పొందాలని భావించిన ప్రజలు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లినా అందుబాటులో లేవని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అడిగితే మీ ఏరియా ఆశా వర్కర్ లేదా అంగన్‌వాడీ టీచర్లను అడగాలని సమాధా చెప్పడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎండల తాకిడికి వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ లీటర్ మంచి నీటిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ కలుపుకొని తాగాలని అవగాహన సదస్సులు కల్పిస్తున్న ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఏర్పాటు చేయట్లేదని మండిపడుతున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలను అడిగినా.. స్టాకు రాలేదంటూ తప్పించుకోవడంతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ మెడికల్ షాపుల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు దాపరించాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.